epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

T MEDIA

టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : మంగళవారం - ఆగస్టు 29- 2023 - పేజీలు : 3

## ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల చేసిన రాష్ట్రపతి

### - ద్రౌపదీముర్ము



**టీ మీడియా, ఆగస్టు 28, న్యూఢిల్లీ:** ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా రూ.100 స్మారక నాణేన్ని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము విడుదల చేశారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లోని సాంస్కృతిక కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, నటుడు బాలకృష్ణ, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్‌తో పనిచేసిన సన్నిహితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ ముర్ము మాట్లాడుతూ.. భారతీయ సినిమా చరిత్రలో ఎన్టీర్ ఎంతో ప్రత్యేకమన్నారు. కృష్ణుడు, రాముడి వంటి పాత్రల్లో ఆయన నటన అద్భుతమని, ప్రజల్లో చెరగని ముద్ర వేశారని చెప్పారు. రాజకీయాల్లోనూ ఎన్టీఆర్ తన ప్రత్యేకత చాటుకున్నారని తెలిపారు. సామాజిక న్యాయం కోసం ఎంతో కృషి చేశారని వెల్లడించారు. ఎన్టీఆర్ విలక్షణ వ్యక్తిత్వాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని చెప్పారు. హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లో తయారైన ఈ స్మారక నాణెం.. 44 మిల్లీమీటర్ల చుట్టుకొలతతో 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ కలిపి ఉంటుంది. ఓ వైపు ఎన్టీఆర్ బొమ్మ ఉంటే మరోవైపు మూడు సింహాల బొమ్మ ఉంటుంది. ఎన్టీఆర్ శత జయంతి అని హిందీలో రాసి దాని కింద 1923-2023 అని రాసుంటుంది.

## అపాయింట్‌మెంట్ లెటర్‌లను పంపిణీ చేసిన ప్రధాని




**టీ మీడియా, ఆగస్టు 28,న్యూఢిల్లీ :** దేశంలోని యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ హామీనిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు రాష్ట్రీయ రోజ్‌గార్ మేళాను ప్రారంభించింది. ఇందులో భాగంగా సోమవారం ప్రధాని మోడీ 51 వేల అపాయింట్‌మెంట్ లెటర్స్‌ను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంస్థలు, శాఖల్లో ఉద్యోగాల కోసం 51 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ఈ సందర్భంగా మోడీ చెప్పారు. మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రీయ రోజ్‌గార్ యోజన కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'ఆటో మొబైల్, ఫార్మా రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ రెండు పరిశ్రమల ద్వారా రాబోయే రోజుల్లో యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. 2030 నాటికి భారత ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగం రూ. 20 లక్షల కోట్లకు పైగా దోహదపడనుంది. ఈ రంగం ద్వారా యువతకు 13-14 కోట్ల కొత్త ఉద్యోగావకాశాలు కల్పించవచ్చు. ఈ దశాబ్దంలోనే ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా అవతరించనుంది. నేను ఏదైనా హామీని ఇచ్చినప్పుడు దాన్ని నెరవేర్చేందుకు బాధ్యతగా వ్యవహరిస్తాను' అని మోడీ అన్నారు.

## విద్యా దీవెన నిధులను విడుదల చేసిన సిఎం జగన్



**టీ మీడియా, ఆగస్టు 28,నగరి (చిత్తూరు) :** ఎపి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి మూడవ త్రైమాసికానికి చెందిన విద్యా దీవెన నిధులను సోమవారం విడుదల చేశారు. నేడు చిత్తూరు జిల్లా నగరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక నుండి ' జగనన్న విద్యా దీవెన ' పథకం కింద రాష్ట్రంలోని 2022- 23 విద్యా సంవత్సరానికి చెందిన మూడవ త్రైమాసికానికి (ఏప్రిల్23- జూన్23) చెందిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆర్థిక సాయాన్ని అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాలలో సిఎం జగన్ బటన్ నొక్కి జమ చేశారు. ఈ పథకంలో భాగంగా ఏప్రిల్-జూన్ 2023 త్రైమాసికానికి సంబంధించి 9,32,235 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది,

**విద్యాసంస్థల్లో అక్రమాలుంటే 1902కు కాల్ చేయండి : సిఎం జగన్**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ ... విద్యా దీవెన పిల్లల భవిష్యత్తు మార్చబోయే పథకమని అన్నారు. ఉన్నత చదువులకు 100 శాతం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నట్లు చెప్పారు. చదువు కోసం తల్లిదండ్రులు అప్పులపాలవ్వకూడదని అన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన కింద రూ.15,600 కోట్లు అందించామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నామన్నారు. విద్యాదీవెన కింద రూ. 11, 317 కోట్లు అందించామని, నేడు 8, 44,336 తల్లుల ఖాతాల్లో రూ. 680 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. విద్యా రంగంలో అనేక సంస్కరణలు అమలు చేశామని అన్నారు. అమ్మ ఒడి ద్వారా ప్రతి విద్యార్థికి రూ, 15 వేల అందించామని తెలిపారు. స్కూళ్లు ప్రారంభించే నాటికే విద్యాకానుక అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం అమలు చేస్తున్నామని, బైజూస్ కంటెంట్‌తో విద్యార్థులకు బోధన అందిస్తున్నామన్నారు. పేదరికం విద్యార్థుల చదవులకు అడ్డు రాకూడదన్నారు. విద్యాసంస్థల్లో అక్రమాలుంటే 1902కు కాల్ చేయాలని తెలిపారు. 'నాడు-నేడు కింద ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చామని సిఎం జగన్ అన్నారు. మూడో తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్‌తో పాఠాలు చెప్పిస్తున్నామని, ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లు కూడా ఇస్తున్నామని చెప్పారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్నామన్నారు. రోజుకో మెనూతో ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం పెడుతున్నామన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో క్లాస్ రూమ్‌లను డిజిటలైజేషన్ చేశామన్నారు. స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, బైలింగువల్ టెక్స్ట్‌బుక్స్ ఇస్తున్నామన్నారు. డిసెంబర్ నాటికి మరో 33 వేల క్లాస్‌రూమ్‌లు డిజిటలైజేషన్ చేయిస్తామని సిఎం తెలిపారు.

## అవినీతిపై మాట్లాడే హక్కు మోడీకి లేదు

### - తమిళనాడు సిఎం స్టాలిన్



**టీ మీడియా, ఆగస్టు 28, చెన్నై :** అవినీతి గురించి మాట్లాడే నైతిక హక్కు ప్రధాని మోడీకి లేదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అవినీతి కార్యకలాపాల గురించి కాగ్ నివేదిక బట్టబయలు చేసిన నేపథ్యంలో అవినీతి గురించి మాట్లాడే హక్కు ప్రధానికి లేదని స్టాలిన్ స్పష్టం చేశారు. తిరువరూర్ జిల్లాలో నాగపట్నం ఎంపి ఎం.సెల్వరాజ్ కుమార్తె పెళ్ళికి హాజరైన స్టాలిన్ అక్కడ మాట్లాడారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల కోసం స్టాలిన్ ఆ వేదిక నుండే తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై, ప్రధాని నరేంద్ర మోడీపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. భరత్‌మాలా, ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అయోధ్య డెవలప్‌మెంట్, హెచ్‌ఎఎల్ విమానం రూపకల్పన ప్రాజెక్టులు, హైవే టోల్ ప్లాజాల్లో టోల్స్ వసూలు, ఆయుష్మాన్ భారత్ పథకాలతో సహా వివిధ పథకాల్లో అనేక వందల కోట్ల రూపాయిలు మేరకు అవినీతి జరిగిందని కాగ్ నివేదిక వెల్లడించింది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద చికిత్స పొందుతున్నారని తప్పుడు క్లెయిమ్‌లు చేస్తూ చనిపోయిన రోగుల పేరుతో బీమా క్లెయిమ్‌లు పంపిణీ చేశారు. తమిళనాడులోని పెరానర్‌వద్ద గల టోల్ ప్లాజాతో పాటూ ఐదు ప్లాజాల వద్ద పన్ను వసూళ్ళలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయి, ఇతర పథకాల్లో కూడా కోట్లాది రూపాయిల మేరకు అవినీతి జరిగిందని స్టాలిన్ వివరించారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల్లో అవినీతి బాగా పేరుకుపోయిందని, హోం శాఖలోని పలువురు అధికారులపై గరిష్ఠ సంఖ్యలో అవినీతి కేసులు నమోదయ్యాయని కేంద్ర విజిలెన్స్ కమిషన్ తన నివేదికలో పేర్కొందని స్టాలిన్ చెప్పారు. " అవినీతిని కూకటి వేళ్ళతో పీకేస్తామంటూ చెప్పేది ఇలాంటి వ్యక్తులే. వారి తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డిఎంకెపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మమ్మల్ని బెదిరించేందుకు సిబిఐ, ఆదాయ పన్ను, ఇడి వంటి సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారు." అని స్టాలిన్ విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ముత్తరాసన్ కోరినట్లుగానే తిరువరూర్ నుండి తాను ఎన్నికల ప్రచారాన్ని ఆరంభించినట్లు స్టాలిన్ అంగీకరించారు. డిఎంకె నేతృత్వంలోని కూటమి రాష్ట్రాన్ని కాపాడిందని ఆయన చెప్పారు. కేంద్రంలోని బిజెపి 'ఫాసిస్ట్, నియంతృత్వ' పాలనను గద్దె దింపడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడాలన్నదే ప్రతిపక్ష పార్టీల తదుపరి లక్ష్యమని చెప్పారు. ఇందుకోసమే ఇండియా బ్లాక్‌ను ఏర్పాటు చేశామన్నారు. ముంబయిలో జరగబోయే ఇండియా కూటమి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటామని, తాను ఆ సమావేశాలకు హాజరవుతున్నానని చెప్పారు.

## డిసెంబర్ లోనే సార్వత్రిక ఎన్నికలు

### - బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



**టీ మీడియా, ఆగస్ట్ 28, కోల్‌కతా:** సార్వత్రిక ఎన్నికలు ఈ ఏడాది డిసెంబర్‌లో వచ్చినా ఆశ్చర్యం లేదన్నారు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ. ఇప్పటికే ప్రచారం కోసం అన్ని హెలికాప్టర్లను కాషాయ పార్టీ ముందస్తుగా బుక్ చేసుకొందన్నారు. టీఎంసీ యువజన విభాగం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మాట్లాడిన ఆమె మూడోసారి బిజెపి అధికారంలోకి వస్తే 'నిరంకుశ పాలనే'నని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో సీపీఎం పాలనకు ముగింపు పలికాం. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని తప్పకుండా ఓడిస్తాం. ఇప్పటికే అన్ని వర్గాల్లో చీలిక తెచ్చే ప్రయత్నం ఆ పార్టీ చేస్తోంది. మరోసారి అధికారం చేపడితే పరిస్థితులు దారుణంగా ఉంటాయి' అని మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఇక అక్కడి గవర్నర్ తీరుపై మండిపడ్డ ఆమె.. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వంతో సవాలుకు దిగవద్దని సూచించారు.. గవర్నర్ పదవి అంటే తనకు గౌరవం ఉన్నప్పటికీ.. ఆయన తీరు మాత్రం బాగాలేదన్నారు. ఇక ఇటీవల జాదవ్‌పూర్ యూనివర్సిటీలో చోటుచేసుకున్న వివాదంపైనా స్పందించిన మమతా 'గోలీ మారో' అంటూ నినాదాలు చేసిన వారిని అరెస్టు చేస్తామన్నారు. ఇందులో ఎటువంటి మినహాయింపు లేదని తేల్చిచెప్పారు.

## ఆ పార్టీ తీరు హంతకుడే సంతాప సభ పెట్టినట్లుంది

### - ఎమ్మెల్సీ కవిత




**టీ మీడియా, ఆగస్టు 28, కామారెడ్డి :** కాంగ్రెస్ పార్టీ దళితులను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నది. దేశాన్ని, రాష్ట్రాన్ని ఎక్కువ రోజులు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిక్లరేషన్ పెట్టి దళితులకు ఏమో చేస్తామనడం భావ దారిద్ర్యం తప్పా మరొకటి కాదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వచ్చి ఎస్సీ డిక్లరేషన్ చేయడం అర్రస్ పాట పాడినట్టు ఉందని ఎద్దేవా చేశారు. ఎస్సీలను ఎన్నో ఏండ్లు పేదరికంలో ఉంచిన చరిత్ర కాంగ్రెస్‌ది అని మండిపడ్డారు. ఆ పార్టీ రాజకీయ లబ్ధికోసం చేసే ఎత్తుగడలు తప్పా దళితుల కోసం చేసేదేమీ లేదన్నారు. ఇన్ని రోజులు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ దళితులకు ఏం చేసిందని ప్రశ్నించారు. రైతుల కోసం బీజేపీ మీటింగ్ పెట్టడం, ఆ సభకు అమిత్ షా రావడం, హంతకుడే రైతులకు సంతాపం తెలిపినట్టుందని మండిపడ్డారు. మోటర్లకు మీటర్లు పెట్టాలని బీజేపీ ప్రభుత్వం చూస్తున్నదని ఆరోపించారు. దళితుల కోసం పనిచేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. అదే కర్ణాటక రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని కుంటి సాకుగా చెప్తూ ఉచిత పథకాలను ఎత్తి వేసిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభించిన రైతు బంధును కాపీ కొట్టి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం.. 13 కోట్ల మందికి రైతు బంధు ప్రారంభించి 2.5 కోట్ల మందికే ఇస్తున్నారు. రాష్ట్రంలో మాత్రం అందరికీ ఇస్తున్నామని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అభ్యర్థులే లేరన్నారు.

## కాంగ్రెస్ వాళ్ళను కాల్చివేస్తా

### -ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి హెచ్చరిక



**టి మీడియా, ఆగస్టు 28,నాగర్ కర్నూలు :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వాళ్లను కాల్చిపడేస్తానని వ్యాఖ్యానించారు. నాగర్ కర్నూలు నియోజకవర్గంలోని తెల్కపల్లి మండలంలో 'పదేళ్ల ప్రజా ప్రస్థానంలో మర్రన్న' పాదయాత్రలో మాట్లాడుతూ%ౌా% తన జోలికి వస్తే ఒక్కొక్కరిని కాల్చి పడేస్తానని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలను గ్రామాల్లో తిరగకుండా చేస్తానన్నారు. తాను తలుచుకుంటే కాంగ్రెస్ చేయి ఊడిపోతుందన్నారు. నాతో పెట్టుకుంటారా? నాతో పెట్టుకుంటే మీకే మైనస్ అంటూ హెచ్చరికలు జారీ చేశారు. తెల్కపల్లి మండలంలో పాదయాత్ర చేస్తున్న మర్రి మాట్లాడుతుండగా పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఆయన కోపంతో ఊగిపోయారు.

## రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా

### - వారి సపరేటు భేటీ వెనుక సిక్రెట్..?



**టి మీడియా, ఆగస్టు 28,ఢిల్లీ:** ఒకరెమో కేంద్రంలోని అధికారపార్టీకి జాతీయ అధ్యక్షుడు.. మరొకరు అదే పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలు.. ఇంకొకరేమో ఏపీలోని ప్రతిపక్ష పార్టీకి అధినేత.. వెళ్లింది ఒక పని మీద.. కానీ, అక్కడ మరో ఆసక్తికర విషయం చోటుచేసుకుంది. వీరంతా సపరేటుగా భేటీ కావడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దుమ్ముదుమారం రేపుతోంది. ఎన్టీఆర్ 100 స్మారక నాణెం విడుదల సందర్భంగా ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబునాయుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి కూడా ఉండటం ఏపీ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. అసలు వెళ్లింది.. ఒకపని మీద అయితే, అక్కడ మరొకటి చోటుచేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా వీరి కలయిక వెనుక ప్రధాన కారణం.. వచ్చే ఎన్నికల్లో పొత్తు కోసమేనా అనే చర్చ జరుగుతోంది.2019 ఎన్నికలకు ముందు టీడీపీ-బీజేపీల మధ్య గ్యాప్ మొదలైంది. ఎన్నికల నాటికి అది మరింత ముదిరి ఎవరికి వారే అన్నట్టు తయారయ్యింది. 2019 ఎన్నికల ఫలితాల్లో టీడీపీ దారుణ ఓటమికి గురికావడంతో కొన్నాళ్ల పాటు వారి బంధం సైలెంట్ అయిపోయింది. ఆ తరువాత మారిన పరిణామాల దృష్ట్యా ఏపీలో తిరిగి పట్టు సాధించేందుకు అటు బీజేపీ ఇటు జనసేన పార్టీలతో కలిసి నడిచేందుకు చంద్రబాబు ప్లాన్లు వెయ్యడం మొదలెట్టారు. 2024 ఎన్నికలు దగ్గర పడే కొద్దీ అవి ఒక్కొక్కటిగా అమలు చెయ్యడం స్టార్ట్ చేశారు. జనసేన విషయంలో ఇప్పటికే చంద్రబాబు అవి దాదాపు వర్కౌట్ అయినట్టే కనిపిస్తున్నాయి. ఇటు బీజేపీతో కూడా కలసినడిచేందుకు ప్రయత్నాలు అన్ని రకాలుగా సాగుతూ వస్తున్నాయి. అందులో భాగంగా గతంలోనూ అమిత్ షాను, జేపీ నడ్డాను కలిశారు. ఆ తర్వాత నుంచి రెండు పార్టీల మధ్య బంధం క్రమంగా బలపడుతున్నట్టు కనిపిస్తూ వచ్చింది. తాజాగా రాష్ట్రపతి భవన్ వేదికగా ఎన్టీఆర్ 100 స్మారక నాణెం విడుదల కార్యక్రమంలో చంద్రబాబు- జేపీ నడ్డా, పురంధేశ్వరి మధ్య జరిగిన భేటీతో ఇక రెండు పార్టీల మధ్య స్నేహం పూర్తిగా స్థాయిలో చిగురించినట్టేననని.. దాన్ని అధికారికంగా ప్రకటించి చేతులు కలపడమే తరువాయన్న విశ్లేషణలు ఏపీ రాజకీయాల్లో వెల్లువెత్తుతున్నాయి.

## పాఠశాలల్లో ఫోన్లను నిషేధించిన ఏపీ ప్రభుత్వం




**టీ మీడియా, ఆగస్ట్ 28, అమరావతి :** ఏపీ ప్రభుత్వం కీలక ఆదేశాలను జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో మొబైల్ ఫోన్లపై నిషేధం విధించింది. పాఠశాలలకు విద్యార్థులు ఫోన్లను తీసుకురాకుండా ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయులు సైతం తమ ఫోన్లను తరగతి గదుల్లోకి తీసుకురాకూడదని ఆదేశించింది. తరగతి గదులకు వెళ్లే ముందు ఉపాధ్యాయులు తన ఫోన్లను ప్రధానోపాధ్యాయుడికి అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. బోధనకు ఎలాంటి ఆటంకం రాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఉపాధ్యాయ సంఘాలు, ఇతర వర్గాలతో చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. నిబంధనలు ఉల్లంఘించే ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా ప్రధానోపాధ్యాయులు, ఉన్నతాధికారులు చూడాలని ఆదేశించింది.

## తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి

### - ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి



**టీ మీడియా, ఆగస్టు 28,మెదక్ బ్యూరో:** 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో జరగని అభివృద్ధి తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిందని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్టం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు.సోమవారం మెదక్ మండలం కోంటూరు పెద్ద చెరువులో సబ్సిడీపై 1,84,500 చేప పిల్లల విడుదల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లాలో చెరువులన్నీ నిండటంతో చేప పిల్లలు వదిలి నీలి విప్లవం తీసుకురావాలన్నారు.ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత చేప పిల్లలను పెంచి మత్స్యకారులు ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ ఎం. లావణ్య రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, జిల్లా మత్స్యశాఖ అధికారి రజని, మెదక్ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, మెదక్ పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్ రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు కిష్టయ్య, మెదక్ ఎమ్మార్వో శ్రీనివాస్, నాయకులు రవి సిద్ధ గౌడ్, మోహన్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఈసీతో చంద్రబాబు భేటీ..

### - ఏపీలో దొంగ ఓట్లపై ఫిర్యాదు



**టీ మీడియా, ఆగస్టు 28,ఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో అవకతవకలపై సీఈసీకి టీడీపీ బందం ఫిర్యాదు చేసింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు ఈ మధ్యాహ్నం కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సీఈసీ రాజీవ్ కుమార్‌ను కలిశారు. చంద్రబాబు వెంట టీడీపీ ఎంపీలు, పలువురు నేతలు ఉన్నారు. ఓటర్ల జాబితాలో తాము గుర్తించిన అవకతవకలను చంద్రబాబు సీఈసీ రాజీవ్ కుమార్‌కు వివరించారు. ఓటరు జాబితాల అక్రమాలపై సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేశారు. చంద్రబాబు ప్రధానంగా మూడు అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి వివరాలు అందజేశారు. దొంగ ఓట్లు, ఒకే ఇంటి నెంబరుపై వందల సంఖ్యలో ఓట్లు, సున్నా డోర్ నెంబరు ఓట్ల వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు.

## తిరుమల బోనులో చిక్కిన మరో చిరుత.



**టీ మీడియా, ఆగస్టు 28,తిరుమల :** నడకమార్గంలో గతకొద్ది రోజుల నుంచి చిరుతలు సంచరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిరుతలను బంధించేందుకు అటవీశాఖ అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో తిరుమలలో తాజాగా మరో చిరుత బోనులో చిక్కింది. అలిపిరి కాలి నడక మార్గంలో ఏడో నంబర్ మైలు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోనులో చిరుత చిక్కినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. దాదాపు రెండు నెలల వ్యవధిలో నాలుగు చిరుతలను అటవీశాఖ అధికారులు బంధించారు. చిరుతలను పట్టుకునేందుకు పలు మార్గాల్లో బోన్లను టీటీడీ ఏర్పాటు చేసింది. తొలుత ఒక చిరుతను బంధించగా.. ఆ తర్వాత మరో రెండు చిరుతలు, ఇప్పుడు మరొకటి బోనులో చిక్కింది. ప్రస్తుతం చిక్కిన నాలుగో చిరుతను బంధించేందుకు గత వారం రోజులుగా అటవీశాఖ అధికారులు ప్రయత్నాలు చేశారు. రోజూ బోను వరకు వచ్చి చిరుత వెనుదిరుగుతున్నట్లు అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో గుర్తించారు. ఈ క్రమంలో ఎట్టకేలకు ఆదివారం రాత్రి బోనులో చిక్కినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### - సిఐ కృష్ణ



**టీ మీడియా, ఆగస్ట్ 28, జన్నారం:** విద్యార్థినీ, విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లక్షెట్టిపేట సిఐ కృష్ణ అన్నారు. రామగుండం కమిషనర్ రేమో రాజేశ్వరి ఆదేశాల మేరకు సోమవారం రోజు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళల భద్రత పోలీసుల బాధ్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా షీటీమ్ పనివిధానం, మహిళల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు, ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, తదితర అంశాలపై వివరించారు. బాలికలు, మహిళల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం ఎన్నో చట్టాలను తీసుకువచ్చిందని వివరించారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే షీటీమ్‌ను ఆశ్రయించాలని, నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువులు కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సోషల్ మీడియాలో గుర్తుతెలియని వారితో చాటింగ్ చేయవద్దని, ఇతరులు పెట్టే మెస్సేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. అనంతరం పోలీస్ అధికారులకు విద్యార్థినులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ సర్కార్,కళాశాల ప్రిన్సిపాల్, మరియు పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటు వజ్రాయుధం లాంటింది

### - తహశీల్దార్ వనజా రెడ్డి



**టీ మీడియా, ఆగస్ట్ 28, జన్నారం:** ఓటు వజ్రాయుధం లాంటిదని,ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల తహశీల్దార్ వనజా రెడ్డి అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని ఐటిఐ కళాశాలలో ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటు చాలా విలువైనదని, 18 సంవత్సరాలు కలిగిన ప్రతి విద్యార్థి /విద్యార్థిని తప్పనిసరిగా ఓటర్ గా నమోదు చేసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలియచేశారు. నేటి యువత ప్రతి ఒక్కరు తమ బాధ్యత గా వారి ఇరుగు పొరుగు వారికి ఓటు యొక్క ప్రాముఖ్యత తెలియచేసి వారిని ఓటర్ రిజిస్ట్రేషన్ చేయించే భాధ్యత కలిగి ఉండాలని కోరారు.ఓటు వల్ల ఒక మంచి రాజకీయ నాయకున్ని ఎన్నుకోవచ్చని కావున ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్,విద్యార్థులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూం ఇండ్ల పై కాంగ్రెస్ పోరాటం ఆగదు

### - గృహలక్ష్మి పథకం అని మళ్ళీ మోసం చేస్తారా.?

### - విజ్జన్న



**టీ మీడియా, ఆగస్ట్ 28, పెద్దపల్లి బ్యూరో :** నియోజకవర్గంలోని కాల్వశ్రీరాంపూర్ మండలంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు కాల్వశ్రీరాంపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో చాలా మంది నిరుపేదలు ఇండ్లు లేక వారు పడుతున్న ఇబ్బందులు చూసి కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ప్రతి ఒక్క ఊరు నుండి ఎంతమందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అవసరమో వారిని గుర్తించి 1400 పైగా దరఖాస్తుదారులతో కలిసి కాల్వ శ్రీరాంపూర్ బస్టాండ్ లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద డబుల్ బెడ్రూమ్ అర్హులతో కలిసి ధర్నా చేసి అనంతరం మండలంలోని 1400 పై చిలుకు దరఖాస్తులను తహశీల్దార్ కి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు అందించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఇళ్లు నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తామని, దళిత గిరజనులకు రూ. 6 లక్షలతో పాటు ఇంటి నిర్మాణానికి స్థలం అందిస్తామని విజ్జన్న ప్రజలందరికీ భరోసానిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి బిరుదు రాజమల్లు, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎల్.రాజయ్య, మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య, కాల్వ శ్రీరాంపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు డబల్ బెడ్ రూం దరఖాస్తుదారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పక్కా ప్రణాళిక తో వస్తున్నా! ఆశీర్వదించండి

### - పిల్లుట్ల రఘు



**టి మీడియా, ఆగష్టు 28, హుజూర్ నగర్ :** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు బీసీ నాయకుడు ఓజో ఫౌండేషన్ ఛైర్మన్ పిల్లుట్ల రఘు ప్రకటించారు.హుజూర్ నగర్ పట్టణ కేంద్రంలో సోమవారం ఓజో ఫౌండేషన్ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఫౌండేషన్ ఛైర్మన్ పిల్లుట్ల రఘు మాట్లాడుతూ.. హుజూర్ నగర్ అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని హుజూర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి పిసిసి ఏర్పాటు చేసిన ఎన్నికల సెలక్షన్ కమిటీకి తాను ధరఖాస్తు చేసినట్లు తెలిపారు బి.ఫామ్ వస్తే కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తానని రాకుంటే స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో ఉంటానని రఘు స్పష్టం చేశారు.హుజూర్ నగర్ నియోజకవర్గ ప్రజలకు ఎవరికి ఏ సాయం కావాలన్నా మొదటగా రఘున్నే గుర్తుకొస్తాడని ఆయన అన్నారు.

**ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన పిల్లుట్ల రఘు :**

అనేక సేవా కార్యక్రమాల ద్వారా నియోజకవర్గంలోని ప్రజలందరికీ సుపరిచితమైన తాను నేటి నుండి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నట్లు తన రాజకీయ ప్రస్థానాన్ని రఘు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలోనే తనకు సీటు వచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని అన్నారు. బీఎస్పీ, బీజేపి వంటి పార్టీలలో అవకాశం ఉన్నప్పటికీ తాను అటువైపు వెళ్ళడం లేదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీసీ అభ్యర్థిగా పార్టీకి దరఖాస్తు చేసుకున్న తనకే అవకాశం ఉంటుదని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ టికెట్టు ఇవ్వడానికి పార్టీ సభ్యత్వం అక్కర్లేదని ఎన్నారైలు,ప్రజాసేవ చేసే వారికి సభ్యత్వం లేకుండానే అవకాశం కల్పిస్తారని వివరించారు. తనకు అన్ని పార్టీల వారు టచ్ లోనే ఉన్నారని, తన గురించి అండర్ కవర్ ఆపరేషన్ జరుగుతుందని, సుమారు 40 నుంచి 50 వేల ఓటు బ్యాంకు ఉందని, దానిని లక్షకు పైనే వచ్చే ప్రణాళిక రూపొందిస్తామని, పాడైపోయిన లిఫ్ట్ లో గురించి పట్టించుకునే నాథుడే లేదని, అవసరమైతే సొంత ఖర్చులతో లిఫ్ట్ లు బాగుచేయిస్తానని తెలియజేశారు.

# గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలందించండి

### - మెడికోస్ కి మంత్రి శ్రీనివాస్ గౌడ్ సూచన



**టీ మీడియా, ఆగస్టు 28,మహబూబ్ నగర్:** ప్రభుత్వ వైద కళాశాలలో ఎంబిబిఎస్ విద్యనభ్యసించిన ప్రతి విద్యార్థి గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలకు వైద్య సేవలు అందించడంలో ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మహబూబ్ నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన ఎంబిబిఎస్ విద్యార్థుల 2 వ స్నాతకోత్సవ కార్యక్రమానికి (2017 వ బ్యాచ్) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్ వృత్తి దేవుడిచ్చిన గోప్పవరమని, దేవుని తర్వాత ప్రాణాలు కాపాడేది డాక్టర్లని, అందువల్ల నిస్వార్థంగా సేవ చేయాలని, ముఖ్యంగా రాష్ట్రంలో నిరుపేదలకు ,గ్రామీణ ప్రాంతాలలోని వారికి వైద్య సేవలు అందించడానికి వైద్య విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో చదివి వైద్య డిగ్రీ పొందిన ప్రతి ఒక్కరు ఎంబిబిఎస్ తో సరిపెట్టుకోకుండా, పీజీ ,సూపర్ స్పెషాలిటీ వంటి ఉన్నత చదువులు చదవాలని, అలాంటి చదువులకు అవకాశాలను మహబూబ్ నగర్లోనే కల్పిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అవడం వల్లనే మహబూబ్ నగర్ లాంటి జిల్లాలలో మెడికల్ కళాశాలలు ఏర్పాటు అయ్యాయని, ప్రత్యేకంగా రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి మెడికల్ కళాశాల మహబూబ్ నగర్ మెడికల్ కళాశాల అని ,మహబూబ్ నగర్ మెడికల్ కళాశాలకు మంచి చరిత్ర ఉందని, ఉస్మానియా, గాంధీ తర్వాత అత్యంత పోటీ ఉన్న మెడికల్ కళాశాల మహబూబ్ నగర్ మెడికల్ కళాశాల అని అన్నారు. మహబూబ్నగర్ కు మెడికల్ కళాశాల వచ్చిన తర్వాత, నర్సింగ్ కళాశాల తీసుకువచ్చామని, 500 కోట్ల రూపాయలతో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి త్వరలోనే పూర్తికానున్నదని తెలిపారు. ప్రభుత్వం వైద్య విద్యార్థులపై కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నదని, విద్యార్థులు లక్ష్యాన్ని గొప్పగా ఏర్పాటు చేసుకొని లక్ష్య సాధన కృషి చేయాలని అన్నారు.మహబూబ్ నగర్ జిల్లాను మెడికల్ టూరిజం గా అభివృద్ధి చేస్తామని, భవిష్యత్తులో ఎయిర్ పోర్ట్ నుండి మహబూబ్ నగర్ కు సాధ్యమైనంత త్వరగా వచ్చేలా షాద్ నగర్ వరకు ప్రస్తుతం ఉన్న మెట్రో ట్రైన్ ను మహబూబ్ నగర్ వరకు పొడగించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మహబూబ్ నగర్ లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన నిర్మాణానికి కోటి రూపాయలను వారం రోజుల్లో మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అంతేకాక ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియం నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని, సాధ్యమైనంత త్వరగా దానిని మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి వైద్య విద్య పట్టాలను బహూకరించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్ ,ప్రభుత్వ ప్రధానాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్, ప్రిన్సిపల్ అకాడమిక్ డాక్టర్ నవ కల్యాణి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ నావల్ కిషోర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి ప్రసాదరావు, డాక్టర్ విజయ ఎల్దండి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రక్షణ కోసం పోలీస్‌ల అవగాహన సదస్సు



**టీ మీడియా, ఆగస్ట్ 28, పెద్దపల్లి బ్యూరో :** కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాల మోడల్ స్కూల్ విద్యార్థులకు కాల్వశ్రీరాంపూర్ ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం సైబర్ నేరాలు, మహిళల భద్రత, షీ టీమ్స్ ఉపయోగం, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. బాలికలు తమ రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేసిన చట్టాలను తెలుసుకోని ఉపయోగించుకోవాలన్నారు. బాలికలకు బాల్య వివాహాలు చేసి, బాధ్యత తీరిందని తల్లిదండ్రులు అనాలోచితంగా నిర్ణయాలు తీసుకొని బాల్య వివాహాలు జరపాలని ప్రయత్నం చేస్తే సమాచారం ఇవ్వాలని అన్నారు. మహిళల రక్షణ, భద్రత, నేర నియంత్రణకు పోలీసు శాఖ కృషి చేస్తుందని పోలీసులకు అందరు సహకరించాలని, బ్యాంక్ లావాదేవీలను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు నేరాలు చేస్తూ సామాన్య ప్రజలను దోచుకుంటున్నారని, తల్లిదండ్రులకు విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టబుల్ సంపత్, కాన్స్టేబుల్స్ లక్ష్మి రాజాం,వెంకటేష్, అశోక్, మనోజ్, రజిని, టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖబర్దార్ జగదీశ్వర్ రెడ్డి.!

### - జానయ్య యాదవ్ పైన కక్ష సాధింపు చర్యలు మానుకో



**టీ మీడియా, ఆగస్ట్ 28, నడిగూడెం :** యాదవ రాజ్యాధికార సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బడుగుల నాగార్జున యాదవ్ జగదీశ్వర్ రెడ్డి గెలుపు కోసం పని చేస్తే వట్టే జానయ్య యాదవ్ దేవుడైయుండు ఎమ్మెల్యే టికెట్ అడగగానే రౌడీగా, నాయీమ్ గా చిత్రీకరిస్తున్నారు. ఇటువంటి దుశ్చర్యలను యాదవ రాజ్యాధికార సాధన సమితి తీవ్రంగా ఖండిస్తుంది. వట్టే జానయ్య యాదవ్ పైన అక్రమ కేసులు వెనక్కి తీసుకోవాలి. వట్టే జానయ్య యాదవ్ బిఆర్ఎస్ పార్టీకి చేసిన కృషికి అతనికి అవకాశం కల్పించాలి లేదా ప్రజాస్వామ్యబద్ధంగా అతను పోటీ చేసే వాతావరణాన్ని కల్పించకుండా కక్ష సాధింపు చర్యలకు జగదీశ్వర్ రెడ్డి పాల్పడడం దుర్మార్గం. వట్టే జానయ్య పై వేధింపులు మానుకోకుంటే బి ఆర్ ఎస్ పార్టీ యాదవుల ఆగ్రహానికి గురికాక తప్పదు. రానున్న ఎలక్షన్లో యాదవులు బిఆర్ఎస్ పార్టీకి దూరమయ్యే విధంగా జగదీశ్వర్ రెడ్డి పాల్పడుతున్నారు. అదేవిధంగా సూర్యపేట జిల్లాలో మళ్లీ తానే మంత్రిగా ఉండడం కోసం జిల్లాలో గ్రూప్ రాజకీయాలు చేసుకుంటూ మూడోసారి గెలిసే అభ్యర్థులలైన పైళ్ల శేఖర్ రెడ్డి, గొంగడి సునీత, గ్యాదరి కిషోర్ లు గెలిస్తే మంత్రి పదవులు అడుగుతారని వీళ్ళను ఓడగొట్టేందుకు గ్రూప్ రాజకీయాలు చేస్తూ BRS పార్టీ కి నష్టం కలిగించే వ్యక్తి జగదీశ్వర్ రెడ్డిని అధిష్ఠానం కనిపెట్టి జగదీశ్వర్ రెడ్డి పై అనహర్హత వేటువేయాలని యాదవ రాజ్యాధికార సాధన సమితి డిమాండ్ చేస్తుంది.

## మహిళల భద్రత పోలీసుల బాధ్యత డీసీపీ వైభవ్




**టీ మీడియా, ఆగస్ట్ 28, పెద్దపల్లి :** మహిళల భద్రత కోసం షీ టీంలు పనిచేస్తున్నాయని పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలియజేశారు.సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వెంకట పద్మ కన్వెన్షన్ లో పెద్దపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల భద్రత పోలీసుల బాధ్యత అనే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయన్నారు. మహిళలు, విద్యార్థినీల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పమన్నారు.ఈవ్ టీజింగ్,ర్యాగింగ్ కు పాల్పడితే జరిమానాలతో పాటు జైలుశిక్ష తప్పదన్నారు.సైబర్ నేరగాళ్ల భారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సిఐ అనిల్ ఎస్సైలు మహేందర్, అశ్విని తో పాటు పెద్ద సంఖ్యలో పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## సొంత గూటికి చేరిన కార్యకర్తలు



**టీ మీడియా, ఆగస్ట్ 28, పెద్దపల్లి బ్యూరో :** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెద్దరాత్ పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఓరుగంటి కొమురయ్య గౌడ్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ నుండి మళ్లీ సొంతగూటికి వచ్చిన యువత మూడు రోజుల ముందు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ కండువా కప్పుకొని బి ఆర్ ఎస్ లో చేరారు. ఆ పార్టీలో ఉండలేక మళ్లీ పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు సమక్షంలో మళ్లీ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు వీరు అంతా మల్లి కాంగ్రెస్ పార్టీలోకి రావడం చాలా సంతోషం గా ఉంది అన్నారు. ప్రజలు మీరు ఏదో ఒకటి ఆశ చూపిస్తే పార్టీలోకి వస్తున్నారు ఇచ్చిన హామీ నెరవేరదని తెలిసి మళ్ళీ సొంత గూటికి వస్తున్నారని అన్నారు.

## ఆరు అంశాలతో సాధారణ కౌన్సిల్ సమావేశం




**టీ మీడియా, ఆగస్టు 28, రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం చైర్ పర్సన్ జంగం కళ ఆధ్వర్యంలో కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆరు అంశాలతో కూడిన ఎజెండాను మేనేజర్ నాగరాజు కౌన్సిల్ సభ్యులందరికీ ఎజెండా అంశాలను చదివి వినిపించారు. ఆరు అంశాలను కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. ఈ సమావేశంలో జయకృష్ణ విద్యుత్ ఏ.ఇ పట్టణంలోని విద్యుత్ హెచ్.టి విద్యుత్ లైన్ మార్పిడి, వివిధ రకాల సమస్యల గురించి కౌన్సిల్ సభ్యులకు వివరించి వాటిని వెంటనే పరిష్కరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి. వెంకటనారాయణ, వైస్ చైర్ పర్సన్ అర్రం విద్యాసాగర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు,పి. కృష్ణ ప్రసాద్, ఇ.వసంత్, సి హెచ్. ప్రదీప్ కుమార్, జూనియర్ అసిస్టెంట్, కార్యాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎక్సైజ్ ఏపీపీ విజయలక్ష్మి



**టీ మీడియా, ఆగస్టు 28,మచిలీపట్నం :** ఓ అవినీతి అధికారిని లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఓ కేసుకు సంబంధించిన విషయంలో లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుకు స్పందించిన ఎసిబి అధికారులు ఎక్సైజ్ ఎపిపి విజయలక్ష్మిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనపై వివరాల ప్రకారం.. మచిలీపట్నం ఎక్సైజ్ కోర్టులో ఏసీబీ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఓ కేసు విషయంలో రూ. 90 వేలు లంచం తీసుకుంటున్న ఎక్సైజ్ ఎపిపి విజయలక్ష్మిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనిపై ఏసీబీ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఏసీబీ, ఏఎస్పీ స్నేహలత, డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి.

## పదవీ కాలం ముగిసే వరకు మాత్రమే బీఆర్ఎస్‌లో ఉంటాను

**-ఎమ్మెల్యే రేఖానాయక్**



**టి మీడియా, ఆగస్టు 28,ఖానాపూర్ :** కచ్చితంగా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ స్పష్టం చేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ పార్టీ నుండే బీఆర్ఎస్‌లోకి వచ్చానని, మళ్లీ అదే కాంగ్రెస్‌లోకి వెళ్తానని వెల్లడించారు. అయితే ఎమ్మెల్యే పదవీ కాలం ముగిసే వరకు తాను బీఆర్ఎస్‌లో ఉంటానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తనను పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో ఖానాపూర్ ఎమ్మెల్యేగా ఉన్న రేఖానాయక్ పేరు లేదు. ఆమె స్థానంలో మరొకరికి టిక్కెట్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆమె కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇప్పటికే ఆమె భర్త కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె కూడా ఎప్పుడైనా చేరే అవకాశాలు ఉన్నట్లుగా భావిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే పదవీ కాలం ముగిసిన తర్వాత చేరుతానని ఆమె చెప్పడం గమనార్హం.

# కవ్వాల్ ఒక చారిత్రాత్మక ప్రదేశం

**- ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు**

**- కోవ దౌలత్ రావు మొకాశి**



**టీ మీడియా, ఆగస్ట్ 28, జన్నారం:** మండలం లోని కవ్వాల గ్రామ పంచాయతీ పరిధిలో గల పాలగోరి ప్రాంతాన్ని ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావు మొకాశి సందర్శించారు.ఆక్కడ కొలువైయున్న దేవతల ప్రదేశాలను పరిశీలించినారు. ఇది ఒక పవిత్రమైన చారిత్రాత్మక ప్రదేశమని ఆయిన కోనియడారు.పాలగోరి ప్రాంతానికి తూర్పు దిక్కున కోలువైయున్న హనుమంతుని ప్రదేశానికి వెళ్లి అత్రం రాజా వంశ వారసుల గ్రామస్తులు ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని వారితో పాటు హనుమాన్ దేవుడికి నైవేద్యం సమర్పించి, సాముహిక వన భోజనాలు కార్యక్రమంలో పాల్గోని వారితో పాటు భోజనాలు చేశారు.1864 సంవత్సరంలో కవ్వాల్ తాలుకా గా ఉన్నప్పుడు కోవ వంశ మొకాశీలకు నిజాం సర్కార్ వ్రాసి యిచ్చిన రాగి సనద్ గురించి వారికి వివరించినారు. ఆదే విధంగా ఆ ప్రదేశం యొక్క విశిష్టతను, ఆ ప్రాంతంలో కోలువైయున్న దేవతామూర్తులకు సంబంధించిన వివరాలను ప్రతి సంవత్సరం అత్రం వంశ వారసురాలు అక్కడ కోలువైయున్న దేవతలకు చేపడుతున్న పూజా విధానాలను గురించి అడిగి తెలుసుకున్నారు.అయితే ఆక్కడ గల అత్రం వంశ వారసురాల భూమి ఆక్రమణకు గురికావటం పవిత్రమైన వారి దేవతల ప్రదేశాలను, దేవతలను కోంత మంది ఆక్రమించుకోని ఆ భూమిని అక్రమంగా పట్టాలు చేయించటం చాలా బాధాకరమని ఆయన విచారం వ్యక్త పరిచినారు. ప్రభుత్వం వేంటనే స్పందించి ఆక్రమణకు గురైన వారి భూమిని తిరిగి వారికి అప్పగించే విధంగా తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్రం వంశ వారసురాలు ఆత్రం ఆత్రం రాజు,అన్నారావు, జ్యోతిరాం, లచ్చు, గ్రామ పెద్దలు సిడం మోతిరాం, నైతం మాన్కు, ఆదివాసి సేన జన్నారం మండల అధ్యక్షులు దుర్వ యశ్వంత్ రావు, మండల నాయకులు కుమ్ర అరుణ్ కుమార్, లక్ష్మణ్, బోజ్జు,తుడుం దెబ్బ మండల అధ్యక్షులు రాయిసిడం కాళి,మడావి సోము,కోడప శ్రీరాం,కోడప జంగు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌తోనే తలెత్తుకున్న తెలంగాణ

**- 9 ఏండ్ల కింద ఎట్లున్నం..ఇప్పుడెట్లున్నం?**

**- నాడు ఎకరం ధర ఎంత?..**

**- నాడు ఎవుసం ఎట్లున్నది?**

**- తెలంగాణ అన్నదాతలు ఆలోచన చేయాలె**

**- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలువాలె**

**- రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**

**- హస్తం'కు ఓటేస్తే మోర్లె ఏసినట్టే: ఎమ్మెల్సీ కవిత**



**టీ మీడియా, ఆగస్ట్ 28, కమ్మర్‌పల్లి/మోర్తాడ్ :** 'సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ తలెత్తుకున్నదని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'తొమ్మిదేండ్ల కిందట తెలంగాణ ఎట్లుండే. ఇప్పుడెట్లున్నది?' అని అన్నదాతలు, ప్రజలను ప్రశ్నించారు. 'ఇక్కడ ఎకరం భూమి ధర అప్పుడెంత ఉండే.. ఇప్పుడెంత ఉన్నది?.. ఎవుసం అప్పుడెట్ల ఉండే.. ఇప్పుడెట్ల ఉన్నది.' ఒక్కసారి రైతులు ఆలోచన చేయాలని కోరారు. ఎమ్మెల్సీ కవిత, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన బాల్కొండ నియోజకవర్గంలో పర్యటించారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో రూ.8.25 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. నాగాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో జూనియర్ కాలేజీని ప్రారంభించి, విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ రైతు తల దించుకోవద్దు.. తల ఎత్తుకోవాలని మంకుపట్టుబట్టి సీఎం కేసీఆర్ పనిచేయడం వల్లే తెలంగాణలో వ్యవసాయం పండుగ అయ్యిందని గుర్తించాలని అన్నారు. రూ. 19 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయడంతోపాటు రైతుబంధు ద్వారా రైతుల ఖాతాల్లో రూ. 73 వేల కోట్లు జమచేసిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ మాత్రమేనని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలన్నా, వ్యవసాయం బాగుండాలన్నా రైతు నాయకుడు కేసీఆర్ సీఎంగా ఉండాలన్న విషయాన్ని అన్నదాతలు గుర్తించాలని కోరారు.

**బీజేపీ గురించి మాట్లాడటమే వేస్ట్:కవిత**

కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటేస్తే మురుగుకాలువలో వేసినట్టేనని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. బీజేపీ గురించి మాట్లాడుకోవడం కూడా దండుగేనని అన్నారు. వ్యవసాయానికి మూడుగంటల కరెంటే చాలని టీపీసీసీ చీఫ్ రేవంత్ అంటున్నారని, మరి మూడు గంటలతో మూడెకరాలు ఎట్లా పారుతుందని ప్రశ్నించారు. 'అది ఎవుసం తెలిసిన ముఖమా.. ఎద్దు తెలిసిన ముఖమా..నాగలివట్టిన ముఖమా.. మందుజల్లిన ముఖమా' అంటూ రేవంత్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాల్కొండలో కాంగ్రెస్‌కు చెందిన సునీల్‌రెడ్డి కనిపిస్తే ఆ పార్టీ నుంచి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరని ప్రశ్నించాలని అడగాలని ప్రజలకు సూచించారు. రాజకీయ సుస్థిరత, శాంతి భద్రతలు ఇచ్చే, పట్టుదల ఉన్న నాయకుడు మన రాష్ట్రానికి సీఎంగా ఉన్నారు కనుకనే మారుమూల గ్రామాల్లో సైతం అభివృద్ధి వెలుగులు విరబూస్తున్నాయని తెలిపారు. కేసీఆర్‌కు సైనికుడిలాంటి వ్యక్తి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అని, ముఖ్యమంత్రి బాటలోనే వేముల బాల్కొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తున్నారని చెప్పారు. ప్రశాంత్‌రెడ్డికి వేసే ప్రతి ఓటూ కేసీఆర్‌కు బలాన్ని చేకూరుస్తుందని చెప్పారు.

**తెలంగాణపై కేంద్రం పక్షపాత ధోరణి: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి**

తెలంగాణపై కేంద్రం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నదని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మండిపడ్డారు. 75 ఏండ్ల పాలనలో కాంగ్రెస్, బీజేపీలు గ్రామాల్లోని సమస్యలను ఎందుకు పరిష్కరించలేకపోయాయని, మరి తెలంగాణలో ఏవిధంగా సాధ్యమయ్యిందో ప్రజలు ఆలోచించాలని సూచించారు. నిర్మల్ జిల్లాను ఆనుకొని ఉన్న మహారాష్ట్ర గ్రామాలైన కీనీ, అప్పారావుపేట గ్రామాల్లో పింఛన్ రూ.600, 6 గంటల కరెంటు మాత్రమే వస్తుందని చెప్తున్నారని, తెలంగాణలో ఉన్న సంక్షేమ పథకాలు చూసి వారి గ్రామాలను తెలంగాణలో కలుపాలని కోరుకుంటున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి ఎన్నికల్లో పోటీచేస్తానని ప్రకటించగానే.. సీఎం చేసిన అభివృద్ధిని చూసి గ్రామాలకు గ్రామాలు కారు గుర్తుకు ఓటేస్తామని తీర్మానాలు చేసుకుంటున్నాయని చెప్పారు.

**కేసీఆర్ వెంటే నడుద్దాం: ఎంపీ సురేశ్‌రెడ్డి :** కేసీఆర్ నాయకత్వంలో సాధించుకొన్న తెలంగాణ అనతికాలంలోనే అభివృద్ధిలో మెరుస్తున్నదని రాజ్యసభ సభ్యుడు కేఈఆర్ సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. పచ్చబడ్డ తెలంగాణపై అందరికండ్లు పడ్డాయని, అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో లబ్ధిపొందాలనే దురాలోచనతో కొందరు ఎన్నికల వేళ వచ్చి మాయమాటలు చెప్తున్నారని ప్రతిపక్షాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. వాళ్ల మాటలు నమ్మితే ఉన్నది ఊడ్చుకుపోతారని ప్రజలను హెచ్చరించారు. తెలంగాణ అభివృద్ధిబాటలోనే పయనించాలంటే అందరూ సీఎం కేసీఆర్ వెంటే నడువాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, కోటపాటి నర్సింహనాయుడు, రాజారాంయాదవ్ పాల్గొన్నారు.

**సోదరులకు హెల్మెట్ గిఫ్ట్ ఇవ్వండి: కవిత సూచన :** రాఖీ పండుగ సందర్భంగా సోదరులకు హెల్మెట్‌ను గిఫ్ట్‌గా ఇవ్వాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మహిళాలోకానికి విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన డ్రైవింగ్ లైసెన్సుల జారీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి యువత కోసం డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించే గొప్ప కార్యక్రమాన్ని చేపడుతున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలో బంగారు పాలన కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. కవిత ప్రోత్సాహంతో కమ్మర్‌పల్లిలో రూ.3 కోట్లతో స్టేడియం నిర్మించుకున్నట్టు మంత్రి వేముల చెప్పారు. యువత కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఒకేరోజు డ్రైవింగ్ లైసెన్సు ప్రక్రియ పూర్తి అవుతున్నది కేవలం బాల్కొండ నియోజకవర్గంలో మాత్రమేనని చెప్పారు.

# ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనల మేరకు జరగాలి

**- జిల్లా ఎస్పీ**



**టి మీడియా, ఆగష్టు 28, మేళ్ళ చెరువు :** మేళ్లచేరువు మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రవేట్ లిమిటెడ్ సిమెంట్ ప్లాంట్, క్వారీ విస్తరణ కు సంభందించి 31వ తేదీన జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి పోలీసు బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ పరిశీలించారు. మేళ్లచేరువు మండల కేంద్రం లో గల మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రవేట్ లిమిటెడ్ సంస్థ సిమెంట్ ప్లాంట్ విస్తరణకు సంభందించి ఈనెల 31 వ తేదీ రోజున ప్లాంట్, క్వారీ పరిసర ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. దీనికి సంభందించి జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ సోమవారం మేళ్లచేరువు మండల కేంద్రం లో గల మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రవేట్ లిమిటెడ్ సిమెంట్ ప్లాంట్ ఏర్పాటు కానున్న ప్రదేశాన్ని, క్వారీ ప్రదేశాన్ని సందర్శించి, తనిఖీ చేసి పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. బారికెడ్ ల ఏర్పాటు, సభ స్థలం స్టేజి, దుమ్ము లేవకుండా రోడ్లపై వాటరింగ్ చేయడం ఏర్పాట్లు, ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనే ప్రజలకు కల్పించాల్సిన వసతులు, ప్రజలకు, ప్రభుత్వ సిబ్బందికి భోజనం ఏర్పాటు, టెంట్స్ ఏర్పాటు, మార్గాలు, పోలీసు బందోబస్తు స్కీమ్, ప్లాంట్ మ్యాప్, మొదలగు ఏర్పాట్లను వ్యక్తిగతంగా పరిశీలించి ఏర్పాట్లపై సూచనలు, సలహాలను ఇచ్చినారు. పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు అన్ని వసతులను కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయ సేకరణ సక్రమంగా నిబంధనల మేరకు జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాజేష్, సిఐ లు రామకృష్ణా రెడ్డి, రామలింగారెడ్డి, యస్ఐ. సురేష్, బాలకృష్ణ, మై హోమ్ సంస్థ లైజన్ జనరల్ మేనేజర్ రాంమోహన్ రావు, యూనిట్ హెడ్ శ్రీనివాస రావు, అడ్వైజర్ జగన్నాధ రావు.పలువురు పాల్గొన్నారు.

# టి బి ఎస్, ఎస్ బెస్ట్ దరకస్తులు గడువు పెంచాలి

**- ఏ ఐ బి (ఎస్) ఎన్ హెల్ప్ లైన్**

**టి మీడియా, ఆగష్టు 28,హైదరాబాద్:** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అమలు చేస్తున్న బెస్ట్ స్కీమ్ గడువు పొడిగించాలని అఖిల భారత బ్రాహ్మణ(సర్వీస్)నెట్వర్క్ హెల్ప్ లైన్ కమిటీ పరిషత్ ఛైర్మెన్,అధికారులు ను కోరింది..గడువు ఈ నెల 30 తో ముగుస్తుంది అన్నారు. ఈ మేరకు హెల్ప్ లైన్ కన్వీనర్ రావుల పాటి శ్రీనివాసరావు, ఇంఛార్జి ఎస్ శ్రీరమ ప్రకటన విడుదల చేశారు.రెవిన్యూ శాఖ నుండి రావాల్సిన కుల,ఆదాయ ధ్రువీకరణ లు జారీ లో జాప్యం ఉంది అన్నారు. ఏజెన్సి ప్రాంతం లో రెవిన్యూ దృవీకరణ ల విషయం లో అధికారులు అనేక విధాలుగా ఇబ్బందులు పెడుతున్న పరిస్థితి ఉంది అన్నారు. హైద్రాబాద్ లాంటి చోట విచారణ పేరుతో కార్యాలయ లు చుట్టూ తిప్పుతున్నారు అన్నారు.కొత్త గా 50 రూపాయల కోర్టు ఫీ స్టాంప్ పై సెల్ఫ్ డిక్లరేషన్ అడిగారని అన్నారు..ఆ రేటు స్టాంపు లు కొరత రాష్ట్రం మొత్తం ఉంది అన్నారు.ప్రాజెక్ట్ రిపోర్ట్ అనే పేరుతో 2 పేజీ ల రిపోర్ట్ అడిగారని తెలిపారు. ఆ రిపోర్ట్ తయారు లో చాలా సందేహాలు ధరకాస్తు దారులు కు ఉన్నయి అన్నారు. అవసరం అయిన సందేహాల నివృత్తి కల్పించాల్సిన పరిషత్ కి చెందిన హైద్రాబాద్ కార్యాలయం సమాచార కేంద్రము ఫోన్ ఎత్తని స్థితి ఉంది అన్నారు. ఇంత ఇబ్బంది ఉన్న బ్రాహ్మణ సంఘాలు,నాయకులు గా చలామణి అయ్యే వారు నోరు మెదపడం లేదు అన్నారు. కొంత మందికి అన్ని రకాల విచారణ పూర్తి అయినా ఖాతాలో 8 నెలల నుండి డబ్బులు జమ కాలేదు అన్నారు. సమస్య అట్లా ఉంటే, ఇంటర్వ్యూ లు అయ్యి క్షేత్ర స్థాయి పరిశలనలు కొంతమందికి చెయ్యలేదు అన్నారు .ఇంకా కొంత మంది గత ధరకాస్తు దారులు కు ఇంటర్వ్యూ లు కాలేదు అన్నారు..దేముడు వరం ఇచ్చినా (కేసి అర్ ఆదేశం ఇచ్చినా)పూజారి ఇవ్వకుండా ఆపి నట్లు అధికారులు తీరు ఉంది అన్నారు..తక్షణం పై సమస్యలు పరిష్కారం చెయ్యాలని.ఈ విషయాలు గురించి కేసి అర్,కే టి అర్, హరీష్ రావు లుకు వివరాలు తో కూడిన వినతులు,పోస్టు కార్డు లు పంపుతామ ని తెలిపారు.

# ఆ ముగ్గురినీ తొలగించండి.

**- టీటీడీ బోర్డు సభ్యుల పై పిటిషన్**

**- నేరచరిత్ర, లిక్కర్ వ్యాపారాలు చేస్తున్నరు**



**టీ మీడియా, ఆగస్ట్ 28,అమరావతి:** ఇటీవల ఏపీ ప్రభుత్వం టీటీడీ నూతన పాలకమండలని ప్రకటించింది. 24మందితో సభ్యులతో జాబితాను విడుదల చేసింది. అది మొదలు.. వివాదం మొదలైంది. బోర్డు సభ్యులుగా ఎంపిక చేసిన వ్యక్తులపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వివిధ కేసుల్లో ఉన్న వ్యక్తులను, నేరచరిత్ర కలిగిన వారిని బోర్డు సభ్యులుగా నియమించడం ఏంటని ప్రతిపక్షాలు ఫైర్ అవుతున్నాయి. సీఎం జగన్ తిరుమల పవిత్రను, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని మండిపడుతున్నారు.తాజాగా ఈ వ్యవహారం కోర్టుకి చేరింది. టీటీడీ బోర్డు సభ్యుల నియామకాలు సవాల్ చేస్తూ ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పరమ పవిత్రంగా భావించే పాలకమండలిలో నేరచరిత్ర, లిక్కర్ వ్యాపారాలు చేస్తున్న వారిని బోర్డు సభ్యులుగా నియమించడం మంచి పద్ధతి కాదంటూ చింతా వెంకటేశ్వర్లు కోర్టులో పిటిషన్ వేశారు.బోర్డు మెంబర్లుగా క్రిమినల్ కేసులు ఉన్న ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో పాటు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో మెంబర్ గా అవినీతి ఆరోపణలు ఎదుర్కొని న్యాయస్థానాల ద్వారా తొలగించబడిన కేతన్ దేశాయ్, లిక్కర్ స్కామ్ లో ఆరోపణలు ఎదుర్కొన్న శరత్ చంద్రారెడ్డి నియామకాలు సవాల్ చేస్తూ పిల్ దాఖలు చేశారు. వెంటనే ఈ ముగ్గురిని బోర్డు మెంబర్లుగా తొలగించాలని పిటిషన్ లో కోరారు పిటిషనర్.టీటీడీ కోట్లమంది భక్తుల మనోభావాలకు ముడిపడి ఉందన్న పిటిషనర్.. నేరచరిత్ర, క్రిమినల్ కేసులు ఉన్న వారిని సభ్యులుగా నియమించడం సరికాదన్నారు. టీటీడీ ట్రస్టీలుగా నియమించబడిన వారు కళంకితులై ఉండకూడదన్నారు పిటిషనర్. బుధవారం ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది. పిటిషనర్ తరుపు న్యాయవాది జడ శ్రావణ్ వాదనలు వినిపించనున్నారు.టీటీడీ బోర్డు సభ్యులుగా ప్రభుత్వం ఎంపిక చేసిన వారిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. పలు కేసుల్లో ఉన్న వ్యక్తులను, నేరచరితులను బోర్డు సభ్యులుగా నియమించడం దారుణం అంటున్నాయి ప్రతిపక్షాలు. ముఖ్యంగా ఇద్దరిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో చిక్కుకుని అప్రూవర్ గా మారిన శరత్ చంద్రారెడ్డి, గుజరాత్ కు చెందిన కేతన్ దేశాయిలకు టీటీడీ పాలక మండలిలో చోటు కల్పించడంపై విపక్షాలు ఫైర్ అవుతున్నాయి.ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఏడో నిందితుడిగా ఉన్న శరత్ చంద్రారెడ్డి.. జైలుకు కూడా వెళ్లారు. ఈ కేసులో తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న ఆయన ప్రస్తుతం బెయిల్ మీద బయటకు వచ్చారు. అలాంటి వ్యక్తిని టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అదేవిధంగా గుజరాత్‌కు చెందిన కేతన్ దేశాయ్ పై కూడా పలు కేసులు ఉన్నాయి. గుజరాత్ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఆయనపై 8 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం రెండు కేసుల్లో కేతన్ నిందితుడిగా ఉన్నారు. కేసులున్న కేతన్ దేశాయ్‌ను టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎలా నియమిస్తాంటూ ప్రశ్నిస్తున్నారు.బోర్డు సభ్యులపైనే కాదు.. టీటీడీ ఛైర్మన్ గా నియమితులైన భూమన కరుణాకర్ రెడ్డిపైనా తీవ్ర విమర్శలు వచ్చాయి. భూమన క్రిస్టియన్, నాస్తికుడు అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అలాంటి వ్యక్తికి ఛైర్మన్ పదవి ఇవ్వడం ఏంటని సీరియస్ అవుతున్నాయి. పవిత్రమైన తిరుమలలో రాజకీయాలు చేస్తున్నారని సీఎం జగన్ పై ఫైర్ అవుతున్నారు టీడీపీ, బీజేపీ నేతలు. తీహార్ జైల్లో ఉన్న వారితో టీటీడీ పాలక మండలి జాబితా తయారు చేశారా? ఆర్థిక నేరాల్లో జైలుకి వెళ్లొచ్చిన వారిని టీటీడీ బోర్డు సభ్యులుగా ఎలా నియమిస్తారు? అని నిప్పులు చెరుగుతున్నారు. అంతేకాదు.. వెంకన్నతో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవు అని స్ట్రాంగ్ వార్నింగ్ లు ఇస్తున్నారు.

# ఉప్పు నిప్పులా ఉండే వాళ్లిద్దరూ కలిశారు

**- ఒక్కటైన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే**



**టీ మీడియా, ఆగష్టు 28, వైరా:** అవును వారిద్దరూ కలిశారు.. ఉప్పు నిప్పులా ఉండే..వీరు ఒకటయ్యారు.. క్యాంపు కార్యాలయంలో ఇద్దరు భేటీ అయ్యి.. చేతులు కలిపారు. వైరా BRSలో ఎప్పుడూ అసమ్మతి ఉంటుంది..మూడు వర్గాలుగా విడిపోయిన ముగ్గురు నేతలు టికెట్స్ కోసం పోటీ పడ్డారు. చివరి వరకు గట్టి ప్రయత్నం చేశారు. 2018 ఎన్నికల్లో BRS తరపున మదన్ లాల్, ఇండిపెండెంట్‌గా రాములు నాయక్ పోటీ చేశారు. రాములు నాయక్‌కు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మద్దతు ఇచ్చి గెలిపించారు. ఆ తర్వాత రాములు నాయక్ BRSలో చేరారు. అప్పటి నుంచి..రాములు నాయక్,మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి వర్గాలుగా విడిపోయారు. ఒకే వేదికపై వీరు కలిసింది లేదు. విడిగా ఎవరికి వారే సొంతంగా కార్యక్రమాలు నిర్వహించారు. అధిష్ఠానం నుంచి ఎన్నిసార్లు చెప్పినా...నేతల తీరు మారలేదుటికెట్స్ ప్రకటన వరకు తమకే టికెట్ ఇవ్వాలని.. ఆఖరి నిమిషం వరకు ముగ్గురూ ప్రయత్నం చేశారు. కానీ అధిష్ఠానం సిట్టింగ్ ఎమ్మెల్యే రాములు నాయక్‌కు ఝలక్ ఇచ్చింది. జిల్లాలో సిట్టింగ్‌లు అందరికీ టికెట్స్ ఇచ్చినా.. రాములు నాయక్ కి మాత్రం ఇవ్వలేదు. మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్‌కి ఇవ్వడంతో.. నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారాయి..టికెట్ దక్కక పోవడంతో ఎమ్మెల్యే రాములు నాయక్ అసంతృప్తి వ్యక్తం చేస్తారని భావించినా..ఆయన అధిష్ఠానం నిర్ణయానికే కట్టుబడి ఉంటానని ప్రకటించారు. ఇటీవల మదన్ లాల్ నిర్వహించిన ర్యాలీలోనూ రాములు నాయక్ అనుచరులు, ఆయన వర్గీయులు అందరూ పాల్గొన్నారుతాజాగా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంకు వెళ్ళారు. ఇద్దరు భేటీ అయ్యారు.. చేతులు కలిపారు..సీఎం కేసీఆర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. ఆయన నిర్ణయం, ఆదేశాల మేరకు పని చేస్తానని రాములు నాయక్ ప్రకటించారు.. నియోజకవర్గంలో BRS గెలవడం తమ లక్ష్యం అని తెలిపారు. త్వరలోనే కలిసి నియోజక వర్గంలో ప్రచారం చేస్తామని ప్రకటించారు. దీనితో ఇరు వర్గాల కేడర్‌లోనూ.. ఈ పరిణామాన్ని ఆసక్తి కరంగా చర్చించుకుంటున్నారు. టికెట్స్ ప్రకటన ముందు..మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ ఓ మహిళతో సన్నిహితంగా ఉన్న పోటోలు వైరల్ అయ్యాయి.. దీని వెనక ఎమ్మెల్యే రాములు నాయక్ కుట్ర ఉందని.. మదన్ లాల్ వర్గీయులు ఆరోపించారు. టికెట్స్ ప్రకటన ఇద్దరు చేతులు కలిపి ఒకటి కావడంతో.. ఇంట్రెస్టింగ్‌గా మారింది. కొసమెరుపు ఏంటంటే.. ఇద్దరూ బంధువులు కూడా.. ఒకరినొకరు..బావ అని పిలుచు కుంటారు..ఇప్పటి వరకు అయితే ఓకే ఎన్నికల వరకు ఐక్యత ఉంటుందా లేదా చూడాలి.